


ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్....
ట్రింగ్ ట్రింగ్ ట్రింగ్....

కేర్‌లెస్‌గా వాలిన బలమైన చెయ్యి రిసీవర్‌ని అవలీలగా

ఎత్తింది- "హల్లో...." కంచు గొంతు గీరగా పలికింది.

"హల్లో....డియస్పీ దొర గారేనా సార్?" గొంతు వణికింది.

"ఏస్ ....." నిర్లక్ష్యం.

"సార్.న ....న్నమస్తే-నేను చవటపల్లి ఎస్సయి వాజమ్మార్తిని సార్!" కీచు గొంతు సలాములు కొట్టింది.

"చెప్పు!" అధికారం పర్మిష నిచ్చింది.

"సార్! పొద్దున్న ఇక్కడ ఈ చవటపల్లి వాళ్ళూ, ప్రక్కూరు పొరంబోకు పాలెం వాళ్ళూ పంట కాలవ నీటి తగాదా మీద ఘర్షణ పడ్డారు సార్!"

"ఉహుఁ."

"సార్! ఘర్షణప్పుడు నలుగురే వున్నారు కాబట్టి ఎలాగో తగ్గి పోయారు సార్! కానీ ఇంకో రెండు మూడు గంటల్లో ఒకళ్ళ మీదొకళ్ళూ పెద్దదెబ్బ తియ్యాలని ప్లాన్ వేస్తున్నారని మన వాళ్ళు తెలుసుకొన్నారు సార్! దెబ్బంటే అలాంటిలాంటిది కాదు సార్! ఊళ్ళకు వూళ్ళే లేచి కొట్లాటకు కదుల్తున్నాయిట సార్! కసితో కత్తులు నూరుతున్నారుట సార్! గొడవ ఆపక పోయామంటే మారణ హోమం అయిపోతుంది సార్! స్టాఫేమో టవున్లో ఎమ్మెల్లే గారమ్మాయి పెళ్ళి హడావుడిలో వున్నారు సార్! కాబట్టి...."

"సర్లే- అర్థమయింది. వెధవ న్యూసెన్సు" అని కట్ చేసి, "అసలు పొద్దున్నే గొడవపడ్డ నా కొడుకుల్ని మక్కెలు విరగ్గొట్టే సుంటే పోయేది. నీ తెలివి తక్కువతనం వల్ల ఆ ఒళ్ళు బలిసిన వెధవలు తిన్న దరక్క కొట్టుకు చస్తున్నారు." చిటచిటలాడి పోయింది గొంతు.

"సారీ సర్! మీరు చెప్పింది నిజమే సార్!" ఎండుటాకులా అల్లల్లాడింది స్వరం.

"నే చెప్పింది నిజమేనని మళ్ళీ నువ్వు సర్టిఫికెట్ ఇవ్వాలేమిటీ!" కత్తి వేటులాంటి కసురు.

"సారీ సార్! ఎక్స్‌క్యూజ్ మి సర్! ఐ బెగ్ యువర్ పార్డన్ సార్!"

"ఊఁ....నువ్వు మరేం భయ పడి చావకు. మనుషుల్ని పంపిస్తాలే."

"థేంక్యూ సార్! ఉంటాను సార్! నమస్తే సార్!"

* * *

రెండు వ్యానుల్లో బిలబిలమని దిగుతూన్న రిజర్వు పోలీసుల్ని చూసి, తెగ సంబరపడి పోయిన

వాజమ్మూర్తి ఛాతీ నాలుగంగుళాలు పెరిగింది. ధైర్యం పేట్రేగిపోయింది. తన ఇన్‌ఫ్లూయన్స్‌తో కుగ్రామంలో జయమాలిని డాన్సు ప్రోగ్రాం ఫ్రీగా పెట్టించిన వాడిలా కాలు నేలమీద ఆనక, స్టేషన్‌లోకి బయటికి తెగ తిరిగెయ్యసాగాడు.

కాని—

మరో పది నిమిషాలకు బులెట్‌లాగా దూసుకొచ్చి స్టేషన్ ముందు ఆగిన జీపులోంచి, దున్నపోతు మీదనుంచి క్రిందకు దిగుతూన్న యమధర్మరాజులా దూకిన డియస్పీగారిని చూసి, వణవణవణికి చచ్చిపోయి, ఒక అంగలో బయటకు దూకి. సెల్యూట్ కొట్టి, బిగుసుకు పోయాడు.

'ఏడిశావులే గాని—లోపలకు తగలడు' అన్నట్లుగా ఓ చూపు విసిరి, లోపలకు నడిచిన దొరగారి వెంట పెంపుడు కుక్కలా తోకాడించుకుంటూ నడిచాడు వాజమ్మూర్తి.

"ఈ వూళ్ళ వాళ్ళు ఎంత పెరోషియస్ పీపులో నాకు తెలుసు."

"యస్ సార్!"

"అలాగే, పేరుకు తగ్గట్టు నువ్వెంత వాజమ్మవో కూడా తెల్సు."

"హిహి....యస్సార్!" చిందించిన వెర్రినవ్వు వెనక గుటక మింగుడు పడలేదు.

"అందుకే నేనే స్వయంగా వచ్చాను."

"యస్సార్!"

* * *

టైము ఐదు కావస్తోంది.

పడమటకు జారిన సూర్యుడు కొండల వెనకగా, జరగబోయే ఫైటింగ్ సీను చూపి మరీ డ్యూటీ దిగువామని సంబరపడుతూ కాచుక్కూర్చున్నాడు.

సరిగ్గా చవటపల్లి, పొరంబోకు పొలాలకు మధ్యలో డియస్పీగారు, వాజమ్మూర్తి. పోలీసులు- లాఠీలు, తుపాకీలు చేతబట్టి వాచీలు చూసుకుంటూ పచార్లు చేస్తున్నారు.

టైము గడుస్తున్నకొద్దీ వాజమ్మూర్తిలో ఆతృత ఎక్కువ కాసాగింది. రెండు వైపులనుంచీ రాబోయే జన ప్రవాహం కోసం ఎదురు చూస్తున్నాడు ఆశగా. 'రారేమో కొంపదీసి' అని నిరాశ చెందుతున్నాడు కూడా. అప్పోసొప్పో చేసి, పెళ్ళి ఏర్పాట్లన్నీ కనీ వినీ ఎరగని రీతిలో చేస్తే, మర్యాద సరిగ్గా జరగదేమోనని చుట్టాలు రావడం మానేస్తే బాధపడే పెళ్ళి పెద్దలా బాధపడిపోతు

న్నాడు. ఎందుకంటే డియస్పీ అంతటివాడు తమ ఊరికి వచ్చాడు. అదంతా వాజమ్మూర్తిఇన్‌ఫ్లూయన్స్ అని జనమంతా అనుకోవాలని తాపత్రయం. రేపట్నుంచి అందరూ తనంటే భయపడి చావాలని అతగాడి కోరిక.

ఆశ నిరాశలమధ్య అతగాడిలా కొట్టాడుకుంటూండగా 'ఫైటింగ్ సీను లేదేమోరా, జారిపోదాం' అని డిసప్పాయింటైన సూర్యుడను కుంటూండగా, కట్టలు తెగిన గోదావరిలా హోరుమంటూ రెండు వేపుల్నుంచీ ఒకేసారి మహాజన ప్రవాహం.

ఉత్సాహంతో ఎగిరి గంతేసి, "వచ్చేస్తున్నారు సార్!" అన్నాడు వాజమ్మూర్తి ఉబ్బి తబ్బిబ్బవుతూ.

"అంత ఆనందంగా వున్నావేవిటోయ్ మైడియర్ స్టుపిడ్! రెండూళ్ళ మధ్యగా గంగమ్మకు నిన్ను బలిస్తే, వాళ్ళు కొట్టుకోవడం మానేస్తామంటే, ఆ పని చేసి వెళ్ళిపోదామనుకుంటున్నాను" అన్నాడు డియస్పీ పళ్ళు పటపట కొరుకుతూ. నోటికి తాళం పడ్డ వాజమ్మూర్తి తల భూమిలోకి దించుకున్నాడు.

అందరినీ పొజిషన్స్‌లోకి వెళ్ళమని ఆజ్ఞాపించాడు డియస్పీ.

అటు ప్రక్క ఇటు ప్రక్క ఐదు వందల గజాల దూరంలో వున్నారు ఆయా వూళ్ళ ప్రజలు-యువకులు, ముసలివాళ్ళు, పిల్లలు-ఆడ మగ తేడా లేకుండా అంతా వున్నారు. చేతుల్లో కత్తులు, కర్రలు, గునపాలు....

ఎక్కడివాళ్ళ నక్కడే ఆగి పొమ్మన్నట్లుగా సౌంజ్ఞ చేయమన్న దొరగారి ఆజ్ఞనందుకుని రెండు ప్రక్కల జనం వేపుకు కొందరు పోలీసులు తిరిగి చేతులు ఎత్తి వూపుతూ ఆగి పొమ్మనట్లుగా సౌంజ్ఞ చేశారు.

కాని ప్రయోజనం లేదు. అదే వేగంతో రెండు వేపుల్నుంచీ జనం కుమ్ముకొస్తున్నారు.

"వీళ్ళిలా ఆగరు సార్! గుండెలు కావు వాళ్ళవి! బండలు సార్! శతృపక్షం శవాల్ని రాబందులు పీకుతూంటే చూడడం వాళ్ళకు ముచ్చట" అంటూ వాజమ్మూర్తి గొణిగాడు.

"నువ్వు నోర్మూయ్" అంటూనే గబగబా రెండు దిక్కులూ చూసి, "లాఠీలు, తుపాకీలు ఎత్తి బెదిరించండి" ఆజ్ఞ నొసగారు దొరగారు.

జవాన్లు ఆయన ఆజ్ఞని శిరసా వహించారు.

ఫలితం శూన్యం.

మరింత వేగంతో ముందు కొస్తున్నారు జనం.

"అలా ఆగితే వాళ్ళు మనుషులే సార్! తాచుపాముకి దణ్ణం పెట్టి, తిప్పి పంపించే రోజులా సార్! ఇవి?"

పళ్ళు పట పట లాడించి, 'టియర్ గ్యాస్' ప్రయోగించమని ఆర్డరిచ్చారు దొరగారు.

నిముషాల్లో చుట్టు ప్రక్కలంతా దట్టమయిన పొగలు—కారంగా, ఘాటుగా.

కానీ, అదీ నిష్ప్రయోజనమే అయ్యింది. టియర్ గ్యాస్ సెల్స్‌ని బియ్యంలో రాళ్ళేరినట్లు సునాయాసంగా ఏరేసి, ప్రక్కనున్న పంట కాలవలోకి గిరవాటేసి ధైర్యంగా ముందుకు ఉరుకుతూ వస్తున్నారు జనం.

కాకీ బట్టల తాలూకు శరీరాలు ఒణక నారంభించాయి.

వాజమ్మూర్తి పేస్టయిపోయాడు.

"తాటాకు చప్పుళ్ళతో పులుల గుంపుల్ని తరమలేం సార్! అందులో రాక్షస ముండాకొడుకులు వీళ్ళు. ఒకళ్ళ మీదొకళ్ళ కోపం మాట దేవుడెరుగు - ముందు మన లందర్నీ కైమా చేసేసి ఆ తర్వాతే వాళ్ళు కొట్టుకు చస్తారులా వుంది. సార్-సార్! ఆలోచించకండి సార్! ఆర్డరిచ్చేయండి సార్! నిర్దాక్షిణ్యంగా మనల్ని చంపిపారేసి, ఆ తర్వాత వీరవిహారం చేస్తారు సార్!"

డియస్పీ మొహం జేవురించుకుపోయింది.

గుండెల్లో దడ మొదలయ్యింది.

"ఫై ర్!"

ఆయన గొంతు కొండల్లో ప్రతిధ్వనించింది.

అదిరిపడ్డ సూర్యుడు కొండల వెనక్కి పడిపోయాడు.

అంతే!!

కొండలు పగిలిన ధ్వనితో-ఢాం... ఢాం.... ఢాం.

అమ్మా! అయ్యో! రామా! అరుపులు, హాహాకారాలు, గోల, ఏడుపులు, పెడబొబ్బలు.

దీపావళి నాడు మందుగుండు సామాను సగం కాల్చుకుని, మిగిలినది నాగులచవితికి దాచుకున్న చిన్న పిల్లల్లా, ఓ నిముషం మధ్యలో విశ్రాంతి తీసుకుని రెండు వేపులా కళ్ళు పొడుచుకు చూశారు పోలీసులు.

రెండు వేపులా కుప్ప తిప్పలుగా పడిపోయున్నారు జనం.

గోలగా ఏడుస్తూ పారిపోతున్నారు కొద్దిమంది.

పెద్ద పెద్ద మూలుగులు, ఏడు పులు. కురుక్షేత్రం-మరో జలివాన్ వాలా బాగ్.

* * *

"చవటపల్లి, పోరంబోకు పొలెంల మధ్య తగాదాని ఆపుజేయ డానికి ప్రయత్నించిన పోలీసులపై ఇరు వర్గాలవారూ మారణాయుధా లతో దాడి చేయగా, ఆత్మరక్షణకై పోలీసులు జరిపిన కాల్పులలో పది మంది చనిపోయినట్లు, పదిహేను మంది గాయపడినట్లు తెలుస్తోంది. ఒక సబ్ ఇనస్పెక్టర్‌కి, నలుగురు పోలీసులకు తీవ్రమైన గాయాలు తగిలాయి...."

చేతిలో పేపర్ మడుస్తూ, "నిన్న మీరు వెళ్ళొచ్చింది ఈ డ్యూటీ మీదేనా?" అని భర్తను ప్రశ్నించింది లలితమ్మగారు. రక్షకభటులంటే ప్రజల మాన ధనాలతోపాటు, రక్తమాంసాలను, ప్రాణాలను సురక్షితంగా కాపాడే వారనే దురభిప్రాయమున్న భారతీయ వనితామె.

డియస్పీ తల 'అవు'నంటూ వూగింది.

"మీరూ, మీ పోలీసులూ పది మంది గ్రామప్రజల్ని చంపారా?" ఆమె గొంతులో బాధ గూడు కట్టుకుంది.

తేలికగా నవ్వి, "మేము చంపడమేమిటీ? కాల్పుల్లో చచ్చిపోయారు లలితా!" అన్నాడాయన.

కకావికలమైన మనసుతో-"పది మంది అర్ధాయుష్షుతో అన్యాయం చావు చావడమే" అన్నదావిడ స్వగతంగా.

"పేపర్లో అంతే రాస్తారనుకో. నిజానికి ముప్ఫయి ఏడుగురు చచ్చిపోయారు. దాదాపు వంద మందికి గాయాలు తగిలాయి." ఘనకార్యం సాధించినట్లు పలికి, కాకీ డ్రస్సు వేసుకోవడంలో నిమగ్నమయ్యాడాయన.

"మీ పోలీసులకీ తీవ్రమైన దెబ్బలు తగిలాయట గదా?"

ఫక్కున నవ్వు వచ్చింది ఆయనకి. "ఆ వాక్యం ఆత్మరక్షణకోసం కాల్పులు జరిపామన్న వాక్యం కలపకపోతే జనంలోనూ, అసెంబ్లీలోనూ గోలయిపోదూ?"

చలనం లేకుండా కుర్చీలోనే కూర్చునుండిపోయింది లలితమ్మగారు. భర్తకు కాకీ బట్టలందించడానికి ఈ రోజు ఆమెకెందుకో మనసు అంగీకరించడంలేదు.

"ఎందుకు చంపవలసి వచ్చిందండీ అంతమందినీ?" అంటూండగా ఆమె గొంతు ఒణికింది.

"ఆపాలని ప్రయత్నించాం.

వీల్లేకపోయింది. మరి వదిలేస్తే తలలు పగలగొట్టుకు 'ఛస్తారని'" అంటూనే చిన్న బుచ్చుకుని అటు తిరిగి బొత్తాలు పెట్టుకోసాగాడు ఆయన.

తన మాటలు తనకే వింతగా తోచాయి.

అలవోకగా తేలిక నవ్వు నవ్వి, అర్ధవంతంగా నిట్టూర్చి, నిట్ట నిటారుగా లేచి, భర్త కళ్ళల్లోకి సూటిగా చూస్తూ, "హుఁ- వాళ్ళు కొట్టుకు చస్తారని ఆపడానికి మీరు, మీ బలగం వెళ్ళి, మి చేతుల మీదుగా వాళ్ళని కొట్టి చంపి 'లా అండ్ ఆర్డర్' ని బ్రతికించి వచ్చేరా? విచిత్రంగా వుందండీ! నిజంగా ఆలోచించి చూడండి! మీరూ, మీ బలగం వాళ్ళ మధ్యకు వెళ్ళకుండా వుంటే, ఆవేశంతో ఇరుపక్షాలూ దగ్గరయినప్పటికీ, ఆ వూళ్ళ పెద్దల తెలివితేటల వల్లనో, ఆ వూళ్ళ ఆడపడుచుల కన్నీళ్ళ ప్రభావానికో అసలు గొడవే జరగకుండా, ఏదో ఒప్పందం కుదిరిపోయే అవకాశమే లేదంటారా?

"ఒకవేళ కొట్టుకున్నా, ఒకళ్ళిద్దరు గాయపడి రక్తం చిందించినప్పుడో, కళ్ళముందే నేలకొరిగినప్పుడో- ఆవేశాలు చల్లారి, కనువిప్పు కలిగి కలిసిపోవడమో, భయపడి ఎటువారటు పారిపోవడమో జరిగేదే కాదంటారా? ఏదిఏమైనా జోక్యమే లేకుండా వుండి వుంటే అంతమంది చచ్చిపోయి వుండేవారు కాదని, అంతమంది యావజ్జీవితం అవిటివారిగా జీవించాల్సిన ఖర్మ పట్టేదిగాదని నేనంటే మీరు కాదు అని వాదించగలరా?" అని ప్రశ్నించిన ఆవిడ గొంతు ఆ హాలులో గుళ్ళో గంటలా ప్రతిధ్వనించింది.

ఒక పోలీసాఫీసర్ భార్యగా గాకుండా, ఓ స్త్రీమూర్తిలా, భరతమాతే తన భార్యను ఆవహించి తనని సూటిగా ప్రశ్నిస్తూన్నట్లు అనిపించగా, తలవంచి, 'నిజమే నువ్వన్నది. మాజోక్యం లేకపోతేనే ఒక్కోసారి లా అండ్ ఆర్డర్ బాగుంటుంది. మేం వెళ్ళి రెచ్చగొట్టడంవల్ల పరిస్థితి మరింత అధ్వాన్నమవుతుంది' అని లోలోనే ఒప్పుకుని, గబగబా బయటకు నడుచుకుంటూ వెళ్ళిపోయారు దొరగారు- అక్కడింక క్షణం వుండలేక.

ఐనా భార్యతో కబుర్లాడుతూ ఇంట్లోనే కూర్చుంటే ఆయనకెలా కుదురుతుంది? బయట లా అండ్ ఆర్డర్ ప్రోబ్లమ్ ఆయనకో పెద్ద తలనొప్పయిపోయింది మరి! *